## (క్రిందటి సంచిక తరువాయి)

మేడమీద రెండు గదులున్నాయి. ఒక గదిలో బోలెడు పుస్తకాలు ఉండి, చిన్నసైజు లైబ్రరీలా ఉంది. గోడమీద మంచి ఫోటోలు, చక్కటి కుర్చీలు, కిటికీలకు తెరలు ఉన్నాయి. టీపాయిమీద ఎర్రని జినియాపూలతో మెరుస్తున్న ఫ్లవర్‌వాజు ఉంది. చూడగానే ఇది లలిత గది అని తెలిసిపోతూంది.

"అది అన్నయ్య గది" అంది అరుణ.

గదిలోనించి ఏదో సద్దు వినవస్తూంది. అరుణ కాసేపు పరకాయించి చూసి "ఒరేయ్ బాబీ అన్నయ్య వచ్చేశాడ్రోయ్" అంది.

గదిలో ఏదో కలవరం. వెంటనే తలుపు ఓరగా తెరుచుకుంది. ఓ పదేళ్ల కుర్రాడు బిక్కుబిక్కుమంటూ బయటికి అటూ ఇటూ చూశాడు. అతని కళ్లలో ఏదో భీతి!

"నిజంగానా?" అరుణ కేసి చూశాడు.

"లేదులేవోయ్ . . తమాషాకి" అంది విజయ.

"బ్రతికాం . . " అంటూ మళ్లీ గబగబా గదిలోకి వెళ్లాడు, విజయని గమనించకుండా.

విజయ, అరుణలు బాబీని అనుసరించారు. గదిలో చెల్లాచెదురుగా సినిమా పత్రికలు పడిఉన్నాయి. గోడకున్న కాలెండర్లు గాలికి రెపరెపలాడుతున్నాయి. గదిలో ఓ పక్క కిటికీకి దగ్గిరగా ఓ మేజా. దానిపై ఒక ట్రాన్సిస్టరు ఉంది. బాబీ నేలమీద కూర్చుని కంటికో భూతద్దం తగిలించుకుని, పాత గడియారాన్నేదో చేస్తున్నాడు.

గదిలోకి వచ్చిన అరుణకేసి చూస్తూ "అరుణా నువ్వు కిందికి వెడుదూ. అన్నయ్య వస్తే చెబుదూగాని" అన్నాడు.

"ఊహూఁ నేను విజయకి గది చూపెట్టాలి. విజయ అన్నయ్య ఫ్రెండ్" అంది అరుణ.

మొదటిమారుగా విజయమీద చూపులు పరుగెత్తించాడు బాబీ. ఆమెను నిశితంగా పరిశీలిస్తూ "మీరూ మీ తమ్ముళ్లని కొడతారా?" అన్నాడు.

ఒక క్షణం కలవరపడ్డది విజయ. తరవాత సర్దుకుని "మీ అన్నయ్య మిమ్మల్ని కొడతాడా ఏమిటి?" అంది.

"ఓ" అన్నాడు బాబీ.

"నిన్ను కూడానా?" తమాషాగా అంది విజయ.

స్క్రూడ్రైవర్ కిందఉంచి, నుదుటిమీద చెమట తుడుచుకుంటూ అన్నాడు బాబీ "ఓ, క్రికెట్ బంతిని కొట్టినట్లు"

విజయకు అదోలా అయింది. ఏమీ మాట్లాడలేక పోతూందామె.

బాబీనే అన్నాడు "అరుణ అయితే ఏడుస్తుంది"

"మరి నువ్వు?"

"నేనా, ఊహూ. కళ్లు మూసుకుని నుంచుంటాను అంతే— ఎక్కువ నొప్పి ఉండదు. ఏడిస్తే ఇంకా కొడతాడు అన్నయ్య"

మనస్సులో సుళ్లు తిరుగుతున్న భావనలని అణుచుకుంటూ టేబిల్ వేపు నడిచింది విజయ. రేడియో పక్కన మిలమిలలాడుతున్న దంతపు ఫ్రేమ్‌లో తన ఫోటో ఉంది. క్రిందుగా "నా ప్రియమైన చెల్లి" అని వ్రాసి ఉంది. అరుణని టేబిల్‌మీద కూర్చోబెట్టి, కుర్చీలో కూర్చుని ఆ ఫోటో చేతికి అందుకుంది విజయ. కొద్దిరోజుల క్రితమే తనని గొడవ పెట్టి తీసుకున్నాడా ఫోటో రామకృష్ణ. విజయ ఫోటోని తిలకిస్తూంటే, బాబీ తలఎత్తి "అమ్మ ఫోటో చూస్తున్నారా?" అన్నాడు.

"అమ్మఫోటో!" విస్తుపోయింది విజయ.

బాబీ ఆమె ఆశ్చర్యాన్ని గమనించి, లేచివచ్చి ఫోటో చూశాడు. తరవాత "ఓహో, మీదా! ఇంతకుముందు ఇందులో అమ్మ ఫోటో ఉండేది" అన్నాడు.

"మరి ఏది అది?" గది గోడలని పరికించింది విజయ.

"నేను చూపెడతాను" అంటూ అరుణ టేబిలు సొరుగు తెరచింది. అందులో అగ్గిపెట్టె సిగరెట్ పాకెట్ క్రిందుగా ఒక ఫోటో ఉంది. తటస్థంగా దాన్ని అందుకుని ఒకక్షణంచూసి, మళ్లీ లోపల పడేసి సొరుగు మూసేసింది విజయ.

"నీకు పాటలు పాడటం వచ్చా?" అంది అరుణ.

"ఊహూఁ"

"మరే, అక్కయ్య ఎంచక్కా పాడుతుంది. పోనీ నీకు వీణ వాయించటం రాదూ?"

తల అడ్డంగా ఊపింది విజయ.

"మా అక్కయ్యకి వచ్చు" గర్వంగా చెప్పింది అరుణ.

"దానికి డాన్సు చేయటం వచ్చు" అన్నాడు బాబీ.

"అలానా, ఏదీ డాన్సు చెయ్యి అరుణా చూద్దాం" ఉత్సాహంగా అడిగింది విజయ.

"అమ్మో! అన్నయ్య వస్తే?"

"వస్తే ఏం?"

"కేకలేస్తాడు. అక్కయ్యకూడా వీణ వాయించదు, అన్నయ్య ఉంటే"

ఆ అమాయిక హృదయాల్లోని భావనలు విజయని వెర్రులెత్తిస్తున్నాయి. సముదాయిస్తూ అంది "చూడు అన్నయ్యంటే అంత భయపడతావేం? మీ అన్నయ్యేగా! రామకృష్ణ చాలా మంచివాడు. నే చెబుతాలే. ఏదీ డాన్సు చెయ్యి చూద్దాం" అంది.

"మరి నీకు పాటరాదన్నావుగా, అక్కయ్య అయితే 'మధురా నగరి'లో పాట ఎంచక్కా పాడుతుంది"

నవ్వుకుంది విజయ. "సరే. నే పాడతాగా. ఏదీ నుంచో — చక్కగా చెయ్యాలి — ఏం — సిగ్గుపడకూడదు . . ." అరుణను దింపి కిందనుంచోబెట్టింది విజయ.

ఆ అమ్మాయి చెక్కిళ్లు సిగ్గుతో ఎర్రబారి ఉన్నాయి. బాబీ ఒకమాటు ఇటు తిరిగిచూసి తనపనిలో లీనమైపోయాడు. కుర్చీలో కూర్చుని, సన్నగా పాట అందుకుంది విజయ. మృదువుగా, సరళంగా వినవస్తున్న ఆ పాటకు, ఒక క్షణం అలానే నుంచుండిపోయి తరవాత తాళానికనుగుణంగా కదలికలు చూపసాగింది అరుణ.

"మాపటి వేళకు, తప్పక వత్తును
రాజమార్గమిది కృష్ణా . ." వెన్నెల వాకలా తేలిపోతూంది ఆనందభైరవి. అరుణ చిన్న పాదాలలో అదో అందమైన కదలిక. సున్నితంగా, సుతారంగా, సులభంగా చేతులు తిప్పుతూ, స్పష్టంగా భావ ప్రకటన చేస్తున్న ఆ అమ్మాయి కౌశలానికి అబ్బురపడింది విజయ.

బాబీ అటు ఇటూ తిరుగుతున్నాడు.

"విడు విడు నా చేయి" — అరుణ చేతిని వదిలింప్రు కుంటున్నట్లు అభినయిస్తూంది.

తను పాటపాడడం మరిచిపోతానేమో ననిపించింది విజయకు.

పరికిణిని ఒకచేతో ఎత్తిపట్టుకుని, కమలాల తూడులాంటి మరో చేతిని ఒయ్యారంగా వంపుతూంది అరుణ.

"అన్నయ్య వస్తున్నాడే అరుణా"

అరుణ పాదాల కదలిక స్తంభించింది!

ఆనందభైరవి ఆగిపోయింది!

తల ఎత్తి చూసింది విజయ. కిటికీలోంచి ఆవరణలోకి తొంగిచూస్తున్న బాబీ, గబగబా స్క్రూడ్రైవర్ని టేబిల్‌మీద ఉంచి, గడియారం తీసుకుని కిందికి ఉడాయించాడు. అరుణ తమా వెళ్లటానికి ఉద్యమిస్తూంటే, చెయ్యి పట్టుకుని ఆపటానికి ప్రయత్నించింది కాని విడిపించుకొని అటునుండి వెళ్లిపోయింది అరుణ.

ఒంటరిగా మిగిలిపోయింది విజయ. క్రింద మాటలు లీలగా పైకి వినవస్తున్నాయి. గదిలోంచి బయటికి నడిచి, మెట్ల దగ్గిరికి నడిచింది విజయ.

"ఎవరూ, విజయా? — కాస్త కాఫీ అదీ ఏమైనా ఇచ్చావా, నువ్విక్కడ కూర్చుని నవల పుచ్చుకున్నావా?" రామకృష్ణ కంఠం.

"కాఫీకి పెట్టాను ఇప్పుడే నిముషంలో ఇస్తాను" లలిత కంఠం.

"ఎంతసేపయిందేమిటి వచ్చి?"

లలిత చెప్పింది.

"మరి అంతసేపటినుంచి కూర్చోబెట్టి కాఫీ ఇవ్వలేక పోయానా మొద్దూ? నీ కసలు బుర్ర ఉంటేగా? వాళ్ల ఇంటికి వెడితే నిమిషంలో కాఫీ టిఫిన్ ముందు ఉంటుంది. ఏమనుకుంటుంది ఆవిడ?" కేకలేస్తున్నాడు రామకృష్ణ.

"డికాక్షన్ ఒలికిపోయింది అన్నయ్యా, లేకపోతే తొందరగా ఇచ్చేదాన్ని . . ."

"ఎందుకు ఒలికిపోదూ, అంత నాజూకు మనం" వ్యంగంగా వినిపించింది రామకృష్ణ కంఠం. "ఎవరేనా ఇంటికి వచ్చినప్పుడే ఇలాంటివి జరుగుతాయి. టిఫిన్ ఏమీ లేదు కదూ? . . . నిన్న జామపళ్లు తెచ్చానే, ఉన్నాయా?"

లలిత సమాధానం వినబడలేదు.

"ఎందుకుంటాయి? ఆ వెధవొకడు అఘోరించాడుగా ఇంట్లో . . . సరే ఏదో ఒహటి తెచ్చి ఏడు . . ."

మెట్లమీద బూట్ల కటకటక శబ్దం.

గదిలోకి వచ్చి కూర్చుంది విజయ.

"హలో చెల్లాయ్ . . ." గదిలోకి ప్రవేశించాడు రామకృష్ణ.

నవ్వటానికి ప్రయత్నించింది విజయ.

కుర్చీలాక్కుని కూర్చున్నాడు రామకృష్ణ. "కారు చూడగానే కొంచెం అనుమానం వేసింది. తెలిగ్గా కనుక్కున్నావే ఇల్లు? . ."

ఎమ్. ఆర్. ప్రసాద్




విజయ నవ్వింది.

టేబిల్ సొరుగు తీసి, సిగరెట్ పాకెట్ అందుకుంటూ "డ్రైవర్ రాలేదూ?" అన్నాడు.

"లేదు."

"నువ్వే డ్రైవ్‌చేస్తూ వచ్చావన్నమాట." రామకృష్ణ కంఠంలో కంగారు స్పష్టమైంది "నీ కిదివరకోమారు చెప్పాను, బాగా అలవాటయ్యేదాకా ఒంటరిగా బయటికి కారు తీసుకు వెళ్లకని. అందులో ఇటువేపు రోడ్డుగుండా వెళ్లే లారీలవేగం చూడు, గుండెలవిసిపోతాయి."

విజయ మాట్లాడలేదు.

"అలా ఉన్నావేం? — వీళ్లెవరూ నిన్ను పలకరించకుండా. లగేజిని ఉంచినట్లు నిన్ను నాగదిలో పడేసి ఎవరిదారిన వాళ్ళు వెళ్లిపోయి ఉంటారు. అవునా? మావాళ్లకు కాస్త బుద్ధి తక్కువ. ఆ పెద్ద రోగ్ చూడు, కాలేజిలో చదువుతూందన్న మాటేగాని ఇంటికి వచ్చిన వాళ్ళని ఎల్లా మర్యాద చెయ్యాలో తెలియదు. విసుగుపుడితే రేడియో వేసుకోక

(తరువాయి 34 వ పేజీలో)

(31 వ పేజీ తరువాయి)

పోయావ్?"

తలెత్తి చూసింది విజయ "ఛఛ! విసుగు పుట్ట లేదు. నిజానికి చాలా సరదాగా ఉంది" అంది.

నవ్వాడు రామకృష్ణ "మొగమాటానికి అంటు న్నావులే. ఈ కొంపలో సరదా ఏమిటి!" సిగరెట్ ముట్టించి, అగ్గిపుల్ల కిటికీలోంచి బయటికి విసిరి వేశాడు రామకృష్ణ.

విజయ మౌనం.

"సరేగాని, విశేషాలు ఏమిటి? ఇవాళ మీ ఇంటికి వద్దామనుకున్నా, గాని కుదరలేదు. అన్నట్లు ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాను చెల్లాయ్"

"ఏం ఉద్యోగం?"

చెప్పాడు.

"మంచిదే" పొడిగా అంది.

"దొరికితే బాగానే ఉంటుంది. వెధవది అన్నింటికీ సిఫారసులు కావాలి..."



అదో సంబరం
ఫోటో—మోదిని అప్పారావు (రాజమండ్రి–2)

"అన్నయ్యా..."

తలతిప్పిచూసింది విజయ. గుమ్మంలో చేతిలో ట్రేలో పొగలు కక్కుతున్న కాఫీ కప్పులతో నుంచుని ఉంది అరుణ.

"అల్లా గుడ్లు మిటకరిస్తూ నుంచుంటావేం? లోపలికి తెచ్చి ఏడు"

క్షణం తొట్రుపాటుపడింది అరుణ. ఆమె కుడి మోచేయి గుమ్మానికి కొట్టుకుంది.

కాఫీ కప్పులు కిందపడి భళ్ళున బద్దలయ్యాయి.

గభాలున కుర్చీలోంచి లంఘించాడు రామకృష్ణ.

అరుణ చెంప చెళ్ళుమంది!

కళ్ళు మూసుకుంది విజయ.

అరుణ ఏడుస్తోంది. ఎర్రని ఆ అమ్మాయి చెంప కందిపోయింది.

"నోరు ముయ్యి రోగ్! గొంతు పెంచావంటే మరొకటి వడ్డిస్తాను."

అరుణ ఏడుపు ఆగిపోయింది. నిస్సహాయంగా నిల బడి ఉందా అమ్మాయి.

"చేసినపని చాలు. అవతలికి అఘోరించు. ఆ పెద్ద రోగ్ చేతులు పడిపోయాయా? . . . అది డికాక్షన్ ఒలకబోయటం, నువ్వు కాఫీ కప్పులు బద్దలుకొట్టడం.

లలిత పైకి వచ్చింది. జరిగిన సంగతి క్షణంలో గ్రహించింది. అరుణని నెమ్మదిగా సముదాయించి అవతలికి తీసుకు వెడుతూంటే, రామకృష్ణ అన్నాడు "దాన్ని తరవాత సముదాయించవచ్చు. ముందు ఈ చెత్త ఇక్కడినుంచి తీసెయ్!"

లలిత వచ్చి గాజు పెంకులు తీసేసి, తడిగుడ్డలో కాఫీ మరకలు తుడిచేస్తూంటే నిస్తేజంగా చూస్తూండి పోయింది విజయ. ఏం చెయ్యటానికీ తోచటంలేదు ఆమెకు.

రామకృష్ణ రుసరుస లాడుతూనే ఉన్నాడు.

లలిత వెళ్ళిపోయింది.

"అలా తోటలోకి వెళ్ళి కూర్చుందాం రా చెల్లాయ్. ఇది ఇల్లుకాదు. ఒనరకం. ఇంటికి వచ్చిన దానికి కాఫీ కూడా ఇవ్వలేకపోయాను. ఏమీ అనుకోవుకదూ?"

ఏమనుకోగలను!

రామకృష్ణతోపాటే మేడమెట్లు దిగుతూంటే, హాల్లో అరుణ పాదాలకు ఏదో ఆయింట్‌మెంట్ రాస్తోంది లలిత. రామకృష్ణ ఒకసారి ఉగ్రంగాచూసి బయటకు నడిచాడు.

ఏడున్నర దాటినట్లుంది. బాగా చీకటిపడిపోయింది. తోటలో కూర్చుందన్నమాటేగాని విజయకు ఇదోలా ఉంది. రామకృష్ణ అంతా మరిచిపోయినట్లు కబుర్లు చెబుతున్నాడు.

"అలంకార్‌లో మంచి పిక్చర్ ఉంది. రేపు వెడ దామా?" అన్నాడు.

"రేపా? . . . నాకు పని ఉంది."

"ఏం?"

"మా స్నేహితురాళ్లంతా కలిసి ఏదో ప్రోగ్రాం వేశారు."

రామకృష్ణ నిరుత్సాహపడ్డాడు. "పోనీ ఎల్లుండి వెడదాం. నీకోసం ఆగుతాన్నాను మరి. నువ్వు ముందుగా చూసేసి 'అరే మా వదినతో వెళ్లగా' అనకు...ఏం?"

నవ్వటానికి మరోమారు విఫల ప్రయత్నం చేసింది విజయ.

రామకృష్ణ కబుర్లుగాని, చల్లనిగాలికాని ఆమె మనసుని కుదుట బరచలేక పోతున్నాయి.

"మీ లలిత చక్కగా వీణ వాయిస్తుందటగా అంది."

"ఏడిచింది. . . పోనిద్దూ దాని సంగతి ఎందుకూ, మరేదైనా కబుర్లు చెప్పు."

మరేం మాట్లాడడానికి తోచలేదు విజయకు. ఎందుకో తలనొప్పి చుట్టబెట్టుకుంది.

హఠాత్తుగా వెడతానంటూ లేచి నుంచుంది.

ఏమిటన్నాడు రామకృష్ణ.

"ఎనిమిది అవస్తోంది. వదిన కాచుకునిఉంటుంది" అంది.

రామకృష్ణ కారుదాకా వచ్చాడు "నేను వచ్చి దిగబెట్టనా చెల్లాయ్" అన్నాడు.

"అక్కర్లేదు" అంటూ ఆక్సిలేటర్ బలంగా నొక్కింది.

ఆ రాత్రి భోజనం సహించలేదు విజయకు. "అలా ఉన్నావేం" అన్న పద్మమాటలకు ముక్తసరిగా ఏదో సమాధానం ఇచ్చి గదిలోకి వచ్చి పడుకున్నదన్న మాటే గాని, నిద్రపట్టలేదు విజయకు. కిటికీ దగ్గరికి మంచాన్ని లాక్కుని తోటలోకిచూస్తూ కూర్చుంది. పచ్చపువ్వులా విరుచుకుని ఉన్న వెన్నెల వెలవెలాపోతూ గోచరించింది. చెట్ల ఆకులు మెసక మెసకగా పడు తున్నాయి. నీరవ నిశ్శబ్దం ఆవరించుకుని ఉంది.

— హఠాత్తుగా ఆ నిశ్శబ్దంలో ఎండుటాకు రాలి పడ్డట్టు, ఆమె మెదడులో తిరుగుతున్న విషాదం ముద్ద కట్టి హృదయంలోకి జారిపడింది.

— సన్నని ఏడ్పు!

నిస్సహాయంగా విస్తేజంగా చూస్తున్న అరుణ మొహం! నాట్యంచేస్తూ, లయబద్ధంగా అడుగులు వేస్తున్న ఆ బుల్లి పాదాలపై వేడికాఫీ చేసిన బొబ్బలు!

దిండులో మొహం దాచుకుంది విజయ. ఆమె కనుకొలకుల్లోని కన్నీళ్ల దిండుపై జారిపడ్డాయి.

* * *

ఉదయం ఎనిమిదింటికి తోటలో పూలుకోస్తున్న పద్మ దగ్గరికి పరుగిడి వచ్చింది విజయ.

"ఏమిటే హడావిడి?" అంది పద్మ.

అవనత ముఖి అయి నిలుచుంది విజయ "నన్ను క్షమించానను వదినా. ప్రపంచం తెలీక నిన్నూ, నీ మాటలనీ తేలిక పరిచాను" అంది.

కనకాంబరాలు కోస్తున్న పద్మ హఠాత్తుగా ఆగి పోయి "ఏమిటి పిచ్చి డైలాగులు వదిలేస్తున్నావు!" అంది.

విజయ గంభీరంగా అంది. "లేదు వదినా, నిజంగా అంటున్నాను. నువ్వు క్షమించానను . . ."

విజయకేసి వింతగా చూస్తూ "ఆల్‌రైట్! క్షమిం చేశాం. ఇంతకీ ఏం జరిగింది?" అంది పద్మ.

"కూర్చోమరి చెబుతాను . . ." పచ్చని గరిక పిపుకు వదిన చేతిని పట్టుకుని దారితీసింది విజయ. కూర్చున్నాక అంది "నిన్న రామకృష్ణ ఇంటికి వెళ్లాను వదినా" అని.

"ఊఁ" ప్రశ్నార్థకంగా చూసింది పద్మ.

జరిగినదంతా చెప్పింది విజయ.

మోకాళ్లచుట్టూ రెండు చేతులు పెనవేసి, చేతు లపై చిబుకం ఆన్చి నిశ్చలంగా కూర్చుంది పద్మ.

"ఈ ఉత్తరం చూడు వదినా, రామకృష్ణకు పోస్టు చెయ్యబోతున్నాను" అంటూ ఓ కాగితాన్ని అందించింది విజయ.

విజయవేపు ఓమారు తమాషాగా చూసి, ఉత్తరం లోకి చూపులు పరుగెత్తించింది పద్మ.

"రామకృష్ణా."

నిన్ను 'అన్నయ్యా' అంటూ సంబోధించటానికి ప్రయత్నించి విఫలురాలినయ్యాను. నీకు ఇలాంటి ఉత్తరం రాయటం సమంజసమోకాదో, నాకా హక్కు ఉందో లేదో కూడా తేల్చుకోలేక పోతున్నాను. కాని హృదయంలోని యీ దుర్భరావేదనమాత్రం భరించ లేను.

జగం అంటే నా కెందుకు పడదని నువ్వెన్నోసార్లు గుచ్చి గుచ్చి అడిగావు. నెనతన్ని సరిగ్గా అర్థంచేసుకో లేదన్నావు. నవ్వు వస్తోంది నాకు. నీ ప్రశ్నకి సమా ధానం ఇవాళ చెబుతా విను. జగం చెల్లెలు లక్ష్మి

నా క్లాస్‌మేట్. లలితలాగే చక్కటి గుణగణాలు కల అమ్మాయి. మా అరుణలాగే వాళ్ళకీ ఓ చిన్న చెల్లాయి ఉంది. టర్మినల్ పరీక్షలకి లక్ష్మి రాలేకపోయింది. కారణం ఏమిటో తెలుసా? వాళ్ళ చిన్ని చెల్లెలిని హాస్పిటల్‌కు తీసుక వెళ్ళవలసి వచ్చింది. సిగరెట్లు తాగుతున్నాడని, తండ్రిగారితో అన్నందుకు జగం ప్రసాదించిన బహుమానమది ఆ అమ్మాయికి. అదొకటే కాదు. వారానికి నాలుగైదు మార్లన్నా మా కాలేజి వదలే సమయానికి వచ్చి తన చెల్లెలిని స్కూటర్‌మీద ఇంటి దగ్గిర డ్రాప్‌చేస్తాడు జగం. లక్ష్మిగారు ఆ చెల్లెలు, శోభ అనే మరో అమ్మాయి!

— ఈ సంఘటనలు నాలో బలంగా ముద్ర వేసుకుని అవి వట్ల విహ్యం కలిగించాయి. కాని, నువ్వుకూడా అలాంటివాడివే అని కలలో కూడ ఊహించలేదునేను!

నాపై నీ మమత చూసి ఓరకంగా బాధపడ్డాను. నీకు సొంత చెల్లాయిలు లేరేమో, సోదరీ ప్రేమకి మొహం వాచిపోయావేమో అనిపించింది నాకు. కాని మొన్నటి అనుభవం నా ఊహలన్నిటినీ తలకిందులు చేసింది.

అన్నగారంటే ఎలా ఉండాలి? ఆరేళ్ల చిన్న చెల్లాయికి పాతికేళ్ళ అన్నకి ఉండవలసిన అనుబంధమేమిటి? అన్నయ్య ఇంటికిరాగానే చెల్లెలికి ఎంతటి ఆనందం కలగాలి! ఎదురు పడ్డ చిన్న చెల్లెని ఎత్తుకుని, ముద్దాడి ఆ అమ్మాయి చేతిలో రెండు బిళ్లలు ఉంచితే ఆ చిన్నారి హృదయం అనుభవించే వర్ణనాతీతమైన మానసికానుభూతిని ఎల్లా తెలియబరిచేది నీకు? అన్నయ్య ఎప్పుడు వస్తాడు అని ఎదురు చూడవలసిన అమ్మాయి నిన్ను చూడగానే దిగాలుపడి, కళ్లలో భయం తాండవించి, తత్తరపాటుతో అవతలికి పరుగిడుతూంటే ఏమనాలి నిన్ను? రాగానే గుండెల్లో బల్లెంతో పొడిచినట్లు మాట్లాడి, ప్రవర్తించి, పోట్లాడి ఆఖరుకు కాఫీ అందివ్వటానికి వచ్చిన ఆ అమ్మాయి చెంప చెళ్ళు మనిపించిన సంఘటన తలుచుకుంటే ఒళ్లు జలదరిస్తుంది నాకు.

పోనీ పెద్దచెల్లెలిని, రోగ్ అని తప్ప 'చెల్లాయ్' అని ఒక సారి అన్నావా? ఊర్లో వారందరి పనులు నెత్తిన వేసుకుని చేసేనీకు, ఆ అమ్మాయిని తీసుకువెళ్లి కాలేజీలో చేర్పించటానికి తీరిక దొరకలేదు కదూ? ఆ అమ్మాయి వీణ వాయిస్తే నీకు గోలగాఉంటుంది కదూ?

నాకు మటుకు బహుమతులు తెచ్చిపెడతావు. గంటలకొద్దీ టైం వెచ్చిస్తూ పాతిక పేజీల ఉత్తరాలు వ్రాస్తావు. ఇంట్లో పెద్ద చెల్లెలి కసురుకుంటావు, చిన్న చెల్లి చెంప చెళ్ళుమనిపిస్తావు. నాకర్థం కాని దొకటే — సొంత చెల్లిమీద ఏవగింపు, ఊళ్లో వాళ్ళమీద ఆదరణలు, ఆప్యాయతలు ఏమిటి? ఇంట్లో సౌందర్యమూర్తి, సుగుణాలరాసి అయిన లలితలాంటి చెల్లాయిని ఉంచుకుని మరొకరిని "చెల్లాయ్" అనవలసిన కర్మేం పట్టింది నీకు? ఇంట్లోవారిని చీదరించటం, బయటివారిని నెత్తికెక్కించుకోటం, ఇంట్లోవారితో తృణీకారంగా, అవహేళనగామాట్లాడి, బయటివారి పొగుడుతూ వారిచుట్టూ తిరగటం! జగంలోనే కాదు! నీలోనేకాదు ఈ కాలం చాలమంది అబ్బాయిలలో ఇలాంటి అవగుణం చూశాను. ఇదోరకం అహం అనుకుంటాను. పరాయి అమ్మాయిలతో పరిచయాలు చేసుకోటానికి తగిలించుకున్న ఆదరకపు ముసుగేమో అన్న అసందర్భపు భావం సైతం నాలో జనిస్తుంది. ఇంతవరకు నాలో ఏవో చక్కని భావనలు ఉండేవి. కాని నేడవి విచ్ఛిన్నంగా అర్థమవుతున్నాయి. ఎంత యత్నించినా నీ ప్రవర్తనని విశదీకరించుకోలేక పోతున్నాను. ఏ సైకాలజిస్టూ ఇలాంటి విపరీతపు మనస్తత్వాలను విడమర్చి చెప్పలేడేమో!

తమ్ముళ్ళు చెల్లాయిలలో లోటుపాట్లున్నా, అనునయంతో సరిదిద్ది వారిని సక్రమమార్గంలో ఉంచవలసిన బాధ్యత అన్నగారికి ఉంది. ఇంట్లో తమ్ముళ్ళు, చెల్లెళ్లకన్నా నా మీద ఎక్కువ ప్రేమఉందని నువ్వంటే, అది ఎంత అసంబద్ధమైనా, నేను అంగీకరించినా, మా తల్లిగారి ఫోటో తీసేసి అదే ప్రేమలో నా ఫోటో ఉంచటం వణికిస్తుంది నన్ను నిలువునా. స్వర్గాన ఉన్న తల్లిగారికంటే నన్నెక్కువగా నువ్వు చూసుకోవటం నాకు నీ మీద ప్రేమ కలిగించటం లేదు కదా వెగటుపుట్టిస్తుంది. మాతృమూర్తి పట్ల క్షమించరాని అహంధం సలిపావు రామకృష్ణా నువ్వు!

మా ఇల్లు నరకం అన్నావు. నువ్వు రానంతవరకు స్వర్గతుల్యంగా ఉంది. నువ్వు అడుగిడగానే ప్రశాంతత చెదురుమదురై గాలిదుమారంరేగి ప్రళయంగా తయారైంది. నాకు అదోలా ఉంది రామకృష్ణా! నా చుట్టూ ఎంతో విషాదం అలుముకుని ఉంది. నిన్న జరిగిన సంఘటనలు శీతకాలపు గాలుల్లా మనసుని గజగజలాడిస్తున్నాయి. నేనేదో పాపం చేశానన్న భావన నాలో చెలరేగుతూంది. లలిత, అరుణ, బాబీలకు అందవలసిన ఆప్యాయత, ఆత్మీయతల నిశబలించివేశానేమో అనిపిస్తుంది. నాలో శక్తి, విశ్వాసం నశించిపోతున్నాయి. మనస్సులో బాధాకరమైన పోరాటం జరుగుతూంది. బలంలేని ఆశ బలీయమైన వాస్తవికత పాశవంచేసింది.

నిష్కలంకమైన హృదయంలో నా మాటలకు అర్థం గ్రహించటానికి ప్రయత్నించు రామకృష్ణా! మళ్ళీ ఇక ఇటువేపు రాకు. నన్ను 'చెల్లాయ్' అని పిలవకు. నామీద ఏమైనా గౌరవం ఉంటే నీ సొంత తమ్ముళ్లని, చెల్లాయిని ప్రేమించు.

విజయ."

మౌనంగా ఉత్తరం ముగించి, విజయచేతికి అందించింది పద్మ. పూలసెజ్జలోని పూలని కదుపుతున్న విజయ, పద్మకేసిచూస్తూ "ఏం వదినా?" అంది.

"ఈ ఉత్తరం చించెయ్యి విజ్జీ" అంది పద్మ గంభీరంగా.

"వదినా!"

"నీకు అనుభవం తక్కువ. ఆవేశం జాస్తి. ఇందులో నువ్వు వ్రాసిన విషయాలు నూరుపాళ్ళు నిజం కావచ్చు కాని, ఎదటివారిని రెచ్చగొట్టేలా ఉంది ఉత్తరం. పైగా ఏదో నీతి ప్రబోధిస్తున్నావు నువ్వు. అందువల్ల అతను మారుతాడనుకోవడం కేవలం నీ భ్రమ. ఎంతో సున్నిత హృదయం ఉండాలని ఉత్తరాన్ని సరిగ్గా అర్థంచేసుకోవాలంటే. అలాంటివారెవరూ ఇలా ప్రవర్తించరు కూడా . . ."

పద్మవేపు చూస్తూండి పోయింది విజయ.

"పైగా నువ్వొకటి ఆలోచించటంలేదు. గృహంలో ఏది లోపిస్తే దాన్ని బయట వెతుక్కుంటాడు మానవుడు. అలానే ఇంట్లో లభించని సోదరీ ప్రేమని బయట వెతుక్కోవటానికి ప్రయత్నిస్తుండవచ్చు అతను."

"సమర్థిస్తున్నావా వదినా?"

"లేదు. జరిగిన సంఘటనలని మరో కోణంద్వారా చూడ ప్రయత్నిస్తున్నా నంతే!"

"ఇంట్లో సోదరీప్రేమ లోపించిందంటే అందుకు అతనే బాధ్యుడు. తప్పంతా అతనిదే. అతనే. . . "

"బాధ్యత, తప్పు అతనిదే కావచ్చు విజ్జీ. కాని ఏది ఏమైనా, ఎవరి తప్పయి నా ఇంట్లో లోపించినదాన్ని.."

"బయటివారిపై చూపే ఆదరణలు, ఆత్మీయతలలో పదోవంతు ఇంట్లో చూపినా ఇల్లు స్వర్గమవుతుంది. ఏది ఏమైనా అతను నన్ను చెల్లాయ్ అనటం నేనిక సహించలేను" ఆవేశంగా ఊగిపోతూంది విజయ.

నవ్వింది పద్మ "అది చాలా తేలిక. నువ్వు మాట్లాడటం మానేస్తే సరి. పలకరించినా ముభావంగా ఉంటే రెండు రోజుల్లో అతనే గ్రహించుకుంటాడు. అంతేకాని ఇలా ఒకళ్లని మారుస్తాననుకోవటం నీ పిచ్చి విజయా.



ఇదో సంబరం

ఫోటో—వి. కూచిమంచి (బొంబాయి-1)

నేను నీకు ముందే చెప్పాను. మన పరిధులలో మనం ఉండాలని. అలా అంటే ఈ వేళ నీకీ అనవసర మనస్తాపం తప్పేది. ఆలోచించు విజయా! . . ."

రెండు క్షణాలు స్తబ్ధుగా ఉండిపోయింది విజయ. తరవాత చేతిలోని ఉత్తరాన్ని పరపరా చించేసింది!

పూలసజ్జ అందుకుంటూన్న పద్మ "అదో విజయా . . . నీ ప్రియమైన మొగ్గ విచ్చింది చూడు" అంది.

విజయ సన్నజాజి పాదువేపుకి పరుగుతీసింది. వంగికూర్చుని ఆ పువ్వుని పరిశీలిస్తున్న ఆమె మొహంలో త్రుటిలో ఆనందం సన్నగిల్లింది.

ఆమె ప్రక్కన నుంచోని అడిగింది పద్మ "ఏం పువ్వు విజయా అది?" అని.

నిర్లిప్తంగా నవ్వింది విజయ "మొక్కనుచూసే ఎందుకు తెలుసుకోలేకపోయానో అర్థంకావటం లేదు వదినా. ఏదో గొప్పపువ్వు ఉంటుందని ఇన్నాళ్లు భ్రమపడ్డాంకదూ? ఇది హోలీహాక్ పువ్వు. మామూలు ప్రత్తిజాతికి చెందినది. వాసనసైతం ఉండదు వీటికి" అంది. ★